క్లుప్తంగా

170 మందికి ఉచిత వైద్య పరీక్షలు

సంతనూతలపాడు: స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలోని సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఒంగోలు శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పర్యవేక్షణలో నిర్వహించగా, 170 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి నెల రోజులకు మందులు పంపిణీ చేశారు.

మైనింగ్ రాయల్టీ ఒప్పందాన్ని రద్దు చేయాలి

ఒంగోలు టౌన్: గ్రానైట్ రాయల్టీ వసూలును ఏఎంఆర్ సంస్థకు అప్పగించడం దారుణమని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం నేరుగా రాయల్టీ వసూలు చేసి ఏడాదికి 450 కోట్ల రూపాయల ఆదాయాన్ని పొందిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వలన ప్రభుత్వానికి, పరిశ్రమలకు, కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 1వ తేదీ నుంచి పరిశ్రమలను మూసివేశారని, దీంతో చీమకుర్తి, గ్రోత్ సెంటర్, ఒంగోలులో పనిచేస్తున్న వలస కూలీలు ఆకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏఎంఆర్‌కు ఇచ్చిన రాయల్టీ వసూలు నిర్ణయాన్ని రద్దు చేసుకుని గత ప్రభుత్వం అనుసరించిన విధానాన్ని అమలు చేయాలని కోరారు.

కంప్యూటర్ ఆపరేటర్ల సమావేశం



ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రావుతో కంప్యూటర్ ఆపరేటర్లు

ఒంగోలు సబర్బన్: ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పిన్నిక మధుసూదనరావు ఆధ్వర్యంలో ఒంగోలులోని రెవెన్యూ భవన్‌లో ఆదివారం జిల్లా రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు సమావేశమయ్యారు. కంప్యూటర్ ఆపరేటర్ల అసోసియేషన్ ఏర్పాటుపై సమీక్షించారు. ఈ నెల 5వ తేదీ అన్ని జిల్లాల నుంచి రెవెన్యూ కంప్యూటర్ ఆపరేటర్లు ఏపీఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజును కలిశారని మధుసూదనరావు తెలిపారు. ఆయన ఆదేశాల ప్రకారం కంప్యూటర్ ఆపరేటర్లతో సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కొత్తగా కంప్యూటర్ ఆపరేటర్లతో జిల్లా అసోసియేషన్ బాడీ ఏర్పాటుపై చర్చించారు. సమావేశంలో ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా ట్రెజరర్ ఊతకోలు శ్రీనివాసరావు, జిల్లాలోని కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్లమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ తల్లికి పూజలు



ప్రత్యేక అలంకారంలో అల్లూరి పోలేరమ్మ తల్లి

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ, స్థానిక కళాశాల రోడ్డులోని పోలేరమ్మ ఆలయం, మండలంలోని కోలభీమునిపాడు వద్ద ఉన్న ముద్దసానమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిగ్రహామూర్తులను ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన చేశారు. అల్లూరి పోలేరమ్మ ఆలయ ఆవరణలోని నాగ శిలలు, పుట్టకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.

కమ్యూనిటీ హాలు కబ్జా..!

- సప్లయ్ సామగ్రి గోడౌన్‌గా వాడుకుంటున్న టీడీపీ నాయకుడు
- మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్‌కు రెండు సార్లు అర్జీలిచ్చినా ప్రయోజనం శూన్యం
- సమస్య పరిష్కారం కాకపోయినా.. పరిష్కారం అయినట్లు అర్జీదారునికి సమాచారం
- ఒంగోలు నగర మేయర్ అండదండలే కారణమని ఆరోపణలు
- ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి జంప్ చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నాడంటూ ఆ నాయకుడిపై విమర్శలు



టీడీపీ నాయకుడు జడా సుధాకర్ కబ్జా చేసిన చెరువుకొమ్ముపాలెంలోని కమ్యూనిటీ హాలు


ఒంగోలు సబర్బన్: ప్రజల అవసరాల కోసం ప్రభుత్వ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాలును అధికార టీడీపీకి చెందిన ఓ చోటా నాయకుడు తన సొంత అవసరాలకు వాడుకుంటున్నాడు. అధికార పార్టీ నాయకుల అండదండలతో ఏకంగా వ్యాపార కేంద్రంగా మార్చుకున్నాడు. ప్రజల అవసరాల కోసం ఏర్పాటు చేసిన భవనాన్ని ఏకంగా షామియానాలు, ఇతర సప్లయ్ సామగ్రి గోడౌన్‌గా మార్చేశాడు. అదెక్కడో మారుమూల ప్రాంతంలో అనుకుంటే పొరపాటే. ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని 18వ డివిజన్‌లో ఉన్న చెరువుకొమ్ముపాలెం ఎస్సీకాలనీలోనే ఇదంతా జరుగుతోంది. 20 సంవత్సరాల క్రితం ఎస్సీకాలనీలో ప్రజల అవసరాల నిమిత్తం కమ్యూనిటీ హాలు, లైబ్రరీగా వినియోగించుకునేందుకు ప్రభుత్వ నిధులు వెచ్చించి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ పేరుతో కమ్యూనిటీ హాలు నిర్మించారు. దానిని ప్రస్తుతం టీడీపీ స్థానిక నాయకుడైన జడా సుధాకర్ కబ్జా చేశాడు. అందులో షామియానాలు, సప్లయ్ సామాన్లు, కుర్చీలు, డ్రమ్ములు నింపి గోడౌన్‌గా మార్చేశాడు. తన సొంత అవసరాలకు వినియోగించుకుంటూ కమ్యూనిటీ అవసరాలను మరుగునపడేశాడు.


మేయర్ గంగాడ సుజాత అండతో పట్టించుకోని అధికారులు...

ఒంగోలు నగరపాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత 18వ డివిజన్ నుంచే కార్పొరేటర్ కావడం, కబ్జాదారుడు జడా సుధాకర్‌కు మేయర్ అండదండలు ఉండటంతో అతనిపై చర్యలు తీసుకునేందుకు అధికారులు ధైర్యం చేయడం లేదన్న ఆరోపణలున్నాయి. అందువలనే అతని చెర నుంచి కమ్యూనిటీ హాలుకు విముక్తి కలగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికులందరూ ఏకమైనా టీడీపీ నాయకుడు ఒంగోలు తాలూకా పోలీసులను పురమాయించి తనను ప్రశ్నిస్తున్న వారిని వేధింపులకు గురిచేస్తున్నాడు. దాంతో కాలనీ వాసులు జడా సుధాకర్‌కు భయపడిపోతున్నారు. ఈ చోటా నేత ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ కండువా కప్పుకుని స్థానిక ప్రజలపై పెత్తనం చేస్తుంటాడంటూ విమర్శలున్నాయి. బాధితులు వారి కష్టాలు చెప్పుకోవటానికి అధికార పార్టీ నాయకుల వద్దకు వెళ్లినా అపాయింట్‌మెంట్‌లు కూడా దొరకడం లేదని వాపోతున్నారు. దాంతో చెరువుకొమ్ముపాలెం వాసులు ఈ చోటా నాయకుడి చేష్టలతో అధినాయకులపై సైతం రగిలిపోతున్నారు.

కలెక్టర్ మీ కోసం కార్యక్రమంలో రెండుసార్లు అర్జీలు...

టీడీపీ నాయకుడు జడా సుధాకర్ చెర నుంచి కమ్యూనిటీ హాలుకు విముక్తి కలిగించాలని చెరువుకొమ్ముపాలేనికి చెందిన తాడిపర్తి రాగయ్య కొందరు స్థానికుల సంతకాలతో మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్‌కు రెండు సార్లు అర్జీలిచ్చారు. 2025 మార్చి 3న ఒకసారి, అదే నెలలో 17వ తేదీ రెండో సారి అర్జీలిచ్చారు. వాటిని పరిష్కరించాలని ఒంగోలు తహసీల్దార్‌కు కలెక్టర్ ఆదేశాలిచ్చారు. తహసీల్దార్ పరిశీలించి ఆర్‌ఐకి చెప్పారు. ఆర్‌ఐ చెరువుకొమ్ముపాలెం సచివాలయ అడ్మిన్‌కు సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఒంగోలు నగర పాలక సంస్థ నిధులతో కమ్యూనిటీ హాలు భవనం నిర్మించినందున ఒంగోలు నగర కమిషనర్‌కు సమస్యను అడ్మిన్ పంపించారు. అనంతరం ఎవరూ పట్టించుకోలేదు. అయితే, కబ్జాదారునికి మేయర్ గంగాడ సుజాత అండ ఉండటంతో నగరపాలక సంస్థ వారు కమ్యూనిటీ హాలును విడిపించలేకపోతున్నారని చెరువుకొమ్ముపాలెం వాసులు ఆరోపిస్తున్నారు. కమ్యూనిటీ హాలును కబ్జాదారుడి చెర నుంచి విడిపించకపోగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్‌కు ఇచ్చిన అర్జీ పరిష్కారమైందని అర్జీదారుడికి సమాచారం ఇవ్వడం కొసమెరుపు. బాధితులు, అర్జీదారులు తమ పనులు మానుకుని మరీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ నిర్వహించే మీ కోసం కార్యక్రమానికి వెళ్లి సమస్యలు తెలియజేస్తుంటే.. పరిష్కరించేవారు లేరంటూ ప్రజలు విమర్శిస్తున్నారు.





మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్‌కు రెండుసార్లు ఇచ్చిన అర్జీల తాలూకా రసీదులు

పారదర్శకత కోసమే ఆర్‌టీఐ చట్టం



చీమకుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది



కార్యదర్శులు, వీఆర్‌ఓలతో ర్యాలీ నిర్వహిస్తున్న మద్దిపాడు ఇన్‌చార్జి ఎంపీడీఓ వరప్రసాద్

మద్దిపాడు: ప్రభుత్వ కార్యాలయాలలో జరిగే పనులలో పారదర్శకత పెంచి అవినీతి జరగకుండా నిరోధించడానికే ఆర్‌టీఐ చట్టం ఏర్పాటు చేయబడిందని ఇన్‌చార్జి ఎంపీడీఓ వరప్రసాద్ అన్నారు. ఆర్‌టీఐ చట్టం ఏర్పాటై 20 సంవత్సరాలైన సందర్భంగా ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి పౌరుడు ఆర్‌టీఐ చట్టాన్ని వినియోగించుకుని న్యాయం పొందడానికి ప్రతి కార్యాలయంలో సహాయ పౌర సమాచార అధికారి, పౌరసమాచార అధికారి, అప్పిలేట్ ఆధికారి ఫోన్ నంబర్లు రాసి ఉంటాయన్నారు. పౌరులు వారికి కావాల్సిన సమాచారాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా పొందవచ్చని తెలిపారు. సమావేశం అనంతరం మద్దిపాడు వీధులలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, పలువురు యువకులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో...

చీమకుర్తి రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం 20వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఎంపీడీవో రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సమాచార హక్కు చట్టంపై ప్రతి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించాలని కార్యదర్శులకు సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి శ్రీనివాసరావు, సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు

జిల్లా గ్రంథాలయంలో...

ఒంగోలు మెట్రో: నగరంలోని జిల్లా గ్రంథాలయంలో ఆదివారం సమాచార హక్కు చట్టం 20వ వార్షికోత్సవం నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి చట్టం ప్రాధాన్యత గురించి సెమినార్ ఏర్పాటు చేశారు. ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ సంపూర్ణ కాళహస్తి, బుక్ రీడింగ్ కమిటీ సభ్యులు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ మధురశ్రీ కవి, బంతికట్ల నాగేశ్వరరెడ్డి, కోటేశ్వరరావు, మంచికంటి వెంకటేశ్వరరెడ్డి, డీసీఐ ఒంగోలు టి.గోవిందమ్మ గ్రంథాలయ పాఠకులు, బొమ్మరిల్లు విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తపట్నంలో...

కొత్తపట్నం: సమాచార హక్కు చట్టం సామాన్య ప్రజలకు బ్రహ్మాస్త్రం లాంటిదని, ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలని సామాజిక సహోద్యమ వేదిక రాష్ట్ర కార్యదర్శి గడ్డం అమృతపాణి అన్నారు. సమాచార హక్కు చట్టం 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అమృతపాణి ఆధ్వర్యంలో కొత్తపట్నంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ కూడలిలో అమృతపాణి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సామాన్యులకు వజ్రాయుధం లాంటిదని అన్నారు. ఈ చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో పసుమర్తి ప్రసాదరావు, పాదర్తి శివ, మోషే, జి.అనిల్, కే ప్రభుకుమార్, ఎం.బాలాజీ, బి.సతీష్, యానాది తదితరులు పాల్గొన్నారు.

వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలి

- జేవీవీ సదస్సులో వక్తల డిమాండ్

గిద్దలూరు రూరల్:

పశ్చిమ ప్రకాశంలో సాగు, తాగు నీటి సమస్య పరిష్కారం కోసం వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని విశ్వభారతి స్కూల్ ఆవరణలో ఆదివారం గిద్దలూరు అభివృద్ధిపై చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ×వెలిగొండ పూర్తయ్యేనా, తాగు, సాగు నీటి కష్టాలు తీరేనా?, ఎన్నాళ్లీ వ్యవసాయం, నీరు కరువైంది-బతుకు బరువైంది¥ అనే అంశంపై ఏర్పాటు చేసిన చర్చా వేదికలో వక్తలు మాట్లాడారు. అన్నదాతకు ఆసరా కల్పించాలంటే వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలన్నారు. వర్షాలపై ఆధారపడి వ్యవసాయం చేయాల్సిన పరిస్థితుల్లో రైతుల కష్టాలను పరిష్కరించాలంటే వెలిగొండ ప్రాజెక్టును కచ్చితంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. 4.5 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల జనాభాకు తాగునీరు అందించే వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకపోవడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం అర్థమవుతోందన్నారు. రాష్ట్రంలో లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెడుతున్నారు కానీ, వెలిగొండ ప్రాజెక్టు కోసం రూ.3600 కోట్లు నిధులు కేటాయించడం లేదన్నారు. వెలుగొండ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను ఖర్చు చేసేందుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయించేందుకు ప్రజలు ఉద్యమించాలన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రధాన సమస్యపై మేధావి వర్గంతో ప్రత్యేక సమావేశం నిర్వహించడం చాలా మంచి కార్యక్రమన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి, శాసన మండలి మాజీ సభ్యుడు కె.ఎస్.లక్ష్మణరావు, జేవీవీ నాయకులు పి.స్వరూపారెడ్డి, రిటైర్డ్ లెక్చరర్ ఎస్.నారాయణరెడ్డి, విశ్వభారతి స్కూల్ కరస్పాండెంట్ రంస్వామిరెడ్డి, ప్రిన్సిపాల్ బండారు ఆదిలక్ష్మి, డాక్టర్ అన్వర్, సీఐటీయూ నాయకులు టి.ఆవులయ్య, డాక్టర్ బ్రహ్మానందరెడ్డి, యూటీఎఫ్ నాయకుడు రమణారెడ్డి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



చర్చా వేదికలో మాట్లాడుతున్న నాయకులు

ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

సంతనూతలపాడు: అనంతపురంలో ఈ నెల 13, 14, 15 తేదీల్లో నిర్వహించనున్న ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు షేక్ నాగూర్‌బీ కోరారు. మండలంలోని పేర్నమిట్ట పరిధిలోని పీర్లమాన్యంలో ఆదివారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఐద్వా జెండాను మండల కమిటీ సభ్యురాలు షేక్ మస్తాన్‌బీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షేక్ నాగూర్‌బీ మాట్లాడుతూ ఐద్వా పోరాట ఫలితంగా మహిళల హక్కుల సాధన కోసం అనేక చట్టాలు సాధించుకున్నామన్నారు. రాష్ట్ర మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుంచి 600 మంది ప్రతినిధులు పాల్గొంటారన్నారు. జిల్లా నుంచి కూడా తరలివచ్చి జయప్రదం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీహెచ్ సునంద, షేక్ ఫరీదాబీ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐద్వా నాయకురాలు నాగూర్‌బీ

కల్తీ మద్యాన్ని వ్యతిరేకిస్తూ నేడు ర్యాలీ

- విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు లంకపోతు అంజిరెడ్డి పిలుపు

కొత్తపట్నం: రాష్ట్రంలో కల్తీ మద్యాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ర్యాలీ నిర్వహించనున్నట్లు పార్టీ కొత్తపట్నం మండల అధ్యక్షుడు లంకపోతు అంజిరెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాలతో ఒంగోలు నియోజకవర్గ అధ్యక్షుడు చుండూరి రవిబాబు ఆధ్వర్యంలో ఒంగోలులోని అంబేడ్కర్ భవనం వద్ద నుంచి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ జరుగుతుందన్నారు. అనంతరం వినతిపత్రం అందజేయనున్నట్లు చెప్పారు. కొత్తపట్నం మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, అభిమానులు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఘనంగా సాయిబాబా నగరోత్సవం



సాయిబాబా నగరోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

సంతనూతలపాడు: స్థానిక సాయిబాబా సత్సంగం ఆధ్వర్యంలో సాయిబాబాకు ఆదివారం భక్తిశ్రద్ధలతో నగరోత్సవం నిర్వహించారు. సాయిబాబా, శరత్ బాపూజీ చిత్రపటాలతో సాయిబాబా భక్తి పాటలు, స్వరాలతో ఘనంగా నగరోత్సవం జరిగింది. భక్తుల నినాదాలు, హారతులతో సాయిబాబాకు సంతనూతలపాడు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ప్రజలు శాంతి, సౌఖ్యం, సౌభాగ్యంతో కొనసాగాలని ప్రార్థించారు. కార్యక్రమంలో సాయిబాబా గురు బంధువులు, మహిళలు, సాయిబాబా సత్సంగ బృంద సభ్యులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు సీజేపై దాడి హేయమైన చర్య

కొత్తపట్నం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీజే గవాయిపై దాడి చేయడం హేయమైన చర్య అని మాల జేఏసీ చైర్మన్ కొప్పోలు ఏడుకొండలు అన్నారు. ఆదివారం సాయంత్రం రాజుపాలెం గ్రామంలో సీజేపై దాడిను ఖండిస్తూ అంబేడ్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా జేఏసీ చైర్మన్ కొప్పోలు ఏడుకొండలు, గ్రామ ఉప సర్పంచ్ ఎల్.వెంకటేశ్వర్లు, అంబేడ్కర్ యువజన సంఘ ప్రతినిధులు, మాల జేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.